లక్షలోపే 'వికాసం'!

- వీటిలో అత్యధికంగా రూ.50 వేల పెట్టుబడి యూనిట్లే..!
- లబ్ధిదారుల సంఖ్య పెంచి చూపేందుకేనని విమర్శలు
- యువ వికాసంలోనూ మితిమీరిన రాజకీయ జోక్యం
- రూ.లక్షకు పైబడితే ఇప్పట్లో వచ్చేది అనుమానమే..!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించే పథకాల్లో రాజీవ్ యువ వికాసం అత్యంత కీలకమైనది. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రూ.4 లక్షల లోపు యూనిట్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించినా సోమవారం రూ.లక్షలోపు యూనిట్లకే మంజూరు పత్రాలు అందజేస్తారని తెలుస్తోంది. దీనిలోనూ అత్యధికంగా రూ.50వేలలోపు యూనిట్లే ఉన్నాయని అంటున్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల రీత్యా రూ.లక్ష పైబడిన యూనిట్ల మంజూరు కాస్తంత ఆలస్యమైనా ప్రచారాన్ని అధికారుల ద్వారా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్ళింది. రూ.లక్షకు పైబడిన యూనిట్లకు ఆప్షన్ చేసుకున్నవారు దరఖాస్తులను మార్చుకునే అవకాశం కూడా కల్పించింది. ఈ మేరకు ఎంపిడీవో, మున్సిపల్ ఆఫీసుల్లో రూ.లక్ష పైబడిన యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న పలువురు అప్లికేషన్లను సవరించుకున్నారు. యూనిట్ల విలువ తగ్గించుకోవటం వల్ల ప్రభుత్వంపై ఆర్థికభారం తగ్గటంతో పాటు ఎక్కువ మందికి లబ్ది చేకూర్చామని చూపించుకోవచ్చనే ప్రభుత్వ వ్యూహం దీనిలో దాగివున్నట్టు ప్రతిపక్ష పార్టీల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. దీనికితోడు ఈ పథకంలోనూ మితిమీరిన రాజకీయజోక్యం బాగానే ప్రచారం జరుగుతోంది.

తొలి విడత లక్ష మందికి మాత్రమే...

రాజీవ్ యువ వికాసం కోసం రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో జూన్ 2వ తేదీన లక్ష మంది అర్హులకు మాత్రమే యూనిట్ల మంజూరు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతగా రూ.50వేలు లేదా రూ.లక్షలోపు మంజూరైన యూనిట్లకు ప్రొసీడింగ్స్ ఇస్తారు. 9వ తేదీ వరకు వీటి ప్రొసీడింగ్స్ కొనసాగుతాయి. 10 నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు శిక్షణ ఇస్తారు. 16వ తేదీ నుంచి యూనిట్ల ప్రారంభోత్సవాలు ఉంటాయి. ఆ తర్వాత రూ.1-2 లక్షలు, చివరగా రూ.2-4 లక్షల యూనిట్లు మంజూరు చేస్తారని భావిస్తున్నారు. సెప్టెంబర్ నాటికి రూ.4 లక్షలలోపు యూనిట్లు మంజూరు అవుతాయని అంటున్నా...కొద్దిమందికి మాత్రమే వీటిని పంపిణీ చేస్తారనే చర్చ నడుస్తోంది. ఈ పథకానికి 16 లక్షలకు పైగా దరఖాస్తులు రాగా లక్ష్యం మేరకు 5 లక్షల మంది అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు ఇటీవల కలెక్టర్లు, ఆయా సంక్షేమ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సూచించారు. ఎక్కువగా కిరాణా, స్టేషనరీ షాపుల కోసం దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత పాడి పరిశ్రమ కోసం దరఖాస్తులు చేశారు. గ్రామాల్లో ఉన్న కిరాణాషాపులు, డెయిరీ పాంలను దృష్టిలో ఉంచుకొని యూనిట్లు మంజూరు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఉపాధి నిమిత్తం ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసేందుకు అవకాశం ఇవ్వాలని పలువురు కోరారు. ఈ మేరకు అవకాశం కల్పించాలిందిగా డిప్యూటీ సీఎం ఆదేశించారు. కిరాణాలు ఎక్కువగా ఉన్న చోట స్టేషనరీ, బ్యాంగిల్ స్టోర్స్, ఫ్యాన్సీ స్టోర్స్ లాంటివి ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు.

మితిమీరిన రాజకీయ జోక్యం!

ఇందిరమ్మ ఇండ్లు, ఇతరత్ర పథకాల తరహాలోనే రాజీవ్ యువ వికాసంలోనూ మితిమీరిన రాజకీయ జోక్యం చోటుచేసుకుంటున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ప్రచారం ఉంది. దీనిలోనూ గత ప్రభుత్వంలో బీఆర్ఎస్‌లో ఉండి...ఇప్పుడు అధికార మార్పిడి దృష్ట్యా కాంగ్రెస్‌లో చేరిన వారికే పలు జిల్లాల్లో లబ్ది చేకూరుతున్నట్టు తెలుస్తోంది. దరఖాస్తుల స్వీకరణ వరకే అధికారుల చేతిలో ఉన్నా ఎంపిక తంతు పూర్తిగా నియోజకవర్గ ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల్లో ఉండటంతో అధికార పార్టీకి చెందిన వారికే లబ్ధి చేకూరే అవకాశం ఉందని ప్రచారం నడుస్తోంది.

కేబినెట్ సబ్‌కమిటీకి త్రీమెన్ కమిటీ రిపోర్ట్

- త్వరలో ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రులు భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన త్రీమెన్ కమిటీ మంత్రుల సబ్ కమిటీకి శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నివేదిక సమర్పించింది. ఈ మేరకు త్వరలో ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రుల సబ్ కమిటీ భేటీ కానున్నది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం సిసిఎల్ఎ కమిషనర్ నవీన్ మిట్టల్, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితర ఉన్నతాధికారులతో త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఉద్యోగ సంఘాలతో భేటీ అయిన త్రీ మెన్ కమిటీ వారి సమస్యలకు సంబంధించిన విజ్ఞాన పత్రాలు స్వీకరించింది. తదుపరి త్రీమెన్ కమిటీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన ఏర్పడిన సబ్ కమిటీని కలిసి నివేదికను అందజేసింది. సబ్ కమిటీలో సభ్యులైన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు సమావేశానికి హాజరయ్యారు. అధికారుల నుంచి నివేదిక స్వీకరించిన సబ్ కమిటీ ఆ నివేదికను పూర్తిగా అధ్యయనం చేసి అతి త్వరలో ఉద్యోగ సంఘాలతో సమావేశం కావాలని నిర్ణయించింది.

70 శాతం మందిలో ఫైబర్ లోపం

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలో 70 శాతం మంది ఫైబర్ లోపాలను ఎదుర్కొంటున్నారని ఆశీర్వాద్ మల్టీగ్రెయిన్స్ హ్యాపీ టమ్మీ సర్వేలో తేలింది. మహిళల్లో ఈ అంతరం మరింత తీవ్రంగా ఉందని ఆ సంస్థ పేర్కొంది. 64 శాతం మగవారితో పోల్చితే 74 శాతం మహిళలు తగు పీచు పదార్థలను తీసుకోవడంలేదని నివేదించింది. ఆన్‌లైన్‌లో 7.4 లక్షలకుపైగా అభిప్రాయాలు సేకరించి ఈ రిపోర్టును రూపొందించినట్టు పేర్కొంది. దీంతో జీర్ణశక్తి ఆరోగ్యానికి ముఖ్యమైన అంశాన్ని చాలామంది ప్రజలు కోల్పోతున్నారని ఇది సూచిస్తోందని ఎస్‌ఆర్‌ఎం ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్స్ గ్యాస్ట్రోఎంటిరాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ బిఎస్ రామకృష్ణ తెలిపారు.

బాగ్‌జోన్ లైఫ్‌స్టైల్ నుంచి అకికి లండన్ బ్రాండ్ ఆవిష్కరణ

హైదరాబాద్ బ్యూరో : లగ్జరీ బ్యాగులు, ఉపకరణాల ఉత్పత్తుల కంపెనీ బాగ్‌జోన్ లైఫ్‌స్టైల్ ప్రయివేటు లిమిటెడ్ కొత్తగా అకికి లండన్ బ్రాండ్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. నేటి మహిళకు సమకాలీన లగ్జరీ హ్యాండ్‌బ్యాగ్ బ్రాండ్‌లలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని పేర్కొంది. ఈ కొత్త బ్రాండ్ ఆధునిక ప్రపంచ డిజైన్‌లను చేతి వృత్తుల వారసత్వంతో సంపూర్ణంగా మిళితం చేసే హ్యాండ్‌బ్యాగ్‌ల తొలి కలెక్షన్‌ను పరిచయం చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధి నిశాంత్ బక్లివాల్ పేర్కొన్నారు.

తాగునీటి సమస్య తీర్చేందుకు కష్ణ, గోదావరి ద్వారా 15 టిఎంసిల నీరు

- హైదరాబాద్ జిల్లా సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ బ్యూరో : హైదరాబాద్ నగరవాసుల తాగునీటి దాహార్తిని తీర్చేందుకు కృష్ణ, గోదావరి నుంచి 15 టిఎంసిల నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం జిహెచ్ఎంసి కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటుచేసిన హైదరాబాద్ జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, సివిల్ సప్లై, వైద్య ఆరోగ్యం, ఎలక్ట్రిసిటీ, విద్య తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి కేటగిరీల వారీగా రుణాలు అందిస్తామన్నారు.

రాజకీయ ముఖచిత్రంలో బిఆర్ఎస్ ఉండదు

టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'బిజెపి– బిఆర్ఎస్ వేర్వేరు కాదు. కవిత ఇష్యు కల్వకుంట్ల కుటుంబ కుంపటి. ఆస్తి పంపకాల్లో తేడాలు వచ్చి రోడ్డున పడ్డారు. ఇక మీదట రాజకీయ ముఖచిత్రంలో బిఆర్ఎస్ పార్టీ ఉండదు. కవిత చెప్పిన కొన్ని విషయాలు వాస్తవాలే. బిజెపి - బిఆర్ఎస్ ఒప్పందాన్ని కవిత బయట పెట్టింది. వీటికి బిఆర్ఎస్ - బిజెపి నాయకత్వం జవాబు చెప్పాలి. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంకా యువ మోర్చా నాయకుడిలాగా మాట్లాడుతున్నారు. ముందు బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ వేసిన ప్రశ్నలకు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి' అని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసాని వద్ద శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఆదివాసీ నాయకుల శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన మహేష్ కుమార్ గౌడ్ బిజెపి, బిఆర్ఎస్ పార్టీల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందిరా గాంధీ మొదలు రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ పార్టీ గిరిజన, ఆదివాసీ హక్కులను కాపాడుతూనే ఉందన్నారు. లంబాడ, కోయ, గోండులను ఆదుకోవాలనే ధ్యేయం కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. అందుకే ఆదివాసీ శిక్షణా తరగతులను ఏర్పాటు చేశామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి అభివృద్ధి, సంక్షేమంలో స్పష్టత ఉందన్నారు. ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోదావరి పుష్కరాలు వైభవంగా నిర్వహించాలి

- ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషితో సరస్వతి పుష్కరాలు విజయవంతమయ్యాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జయశంకర్–భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అధ్యక్షతన 'సరస్వతి పుష్కరాలు డే ఆఫ్ థాంక్స్' కార్యక్రమం శనివారం నిర్వహించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... పుష్కరాలు ఘనంగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి అలోచన మేరకు జిల్లా యంత్రాంగం 12 రోజులు 24 గంటలు నిర్విరామంగా కష్టపడ్డారని తెలిపారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలు దృష్టిలో ఉంచుకుని సరస్వతి పుష్కరాల' నిర్వహణను ప్రభుత్వం ఒక సవాలుగా తీసుకుని నిర్వహించినట్టు తెలిపారు. ప్రభుత్వం రూ.40 కోట్లు కేటాయించగా పుష్కరాలను అత్యంత విజయవంతంగా అధికారులు నిర్వహించారని హర్షం వ్యక్తం చేశారు. సుమారు 30 లక్షల మంది దర్శించుకున్నారని తెలిపారు. 33 శాఖలకు చెందిన అధికారులు మూడు నెలలు కష్టపడ్డారని అన్నారు. తెలంగాణలో తొలిసారిగా కాశీ పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన "సరస్వతి నవరత్న మాలా హారతి" కార్యక్రమం మొత్తం పుష్కరాలకే ప్రధాన ఆకర్షణగా నిలిచిందన్నారు. పుష్కరాల ద్వారా ఆర్‌టిసికి సుమారు రూ.10 కోట్ల ఆదాయం వచ్చిందని అన్నారు. 12 రోజుల పాటు దాదాపు 9 వేల ట్రిప్పులు బస్సులు నడిచాయని తెలిపారు. కొందరు సరస్వతి పుష్కరాలు విజయవంతం కాకుండా చేయాలని కుట్రలు పన్నారని, అయినా సందర్శకులు అవేమీ పట్టించుకోకుండా లక్షలలో పుష్కర స్నానాలు ఆచరించారు అన్నారు. స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం అన్నారు. పుష్కరాల్లో లోటుపాట్లను గుర్తించి భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. కాళేశ్వరానికి వెళ్లే జాతీయ రహదారిని నాలుగు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో కాళేశ్వరం, ఇతర ప్రాంతాల్లో కొత్త బస్సు డిపోల నిర్మాణానికి శ్రీకారం చుడతామని అన్నారు. ఓవైపు అభివృద్ధి... మరోవైపు సంక్షేమంలో తెలంగాణను దేశంలోనే తొలిస్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే ఉచిత బస్సు, 200 లోపు యునిట్లు ఉచిత విద్యుత్, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి లాంటి అనేక ప్రతిష్ఠాత్మక పథకాలకు శ్రీకారం చుట్టామని అన్నారు. అయినా... కొందరు పనిగట్టుకొని మేం ఏమి చేయడం లేదంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రమాదంలో మరణించిన కొమరవెల్లి గ్రామస్థులకు లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. వడదెబ్బకు గురై మరణించిన పారిశుద్ధ్య కార్మికుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం విజయభాను, పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

- ఎస్‌పి పరితోష్ పంకజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (జూన్ 1 నుండి 30 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలూ చేపట్టకూడదని తెలిపారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

- ఎన్ఎంసి చైర్మన్‌కు టిజూడా వినతి

హైదరాబాద్ బ్యూరో : ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్ విచ్చేసిన ఎన్ఎంసి చైర్మన్ డాక్టర్ బి.ఎన్. గంగాధర్‌ను అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. పిజి విద్యార్థుల మానసిక ఆరోగ్యం, జూనియర్ డాక్టర్లు ఎదుర్కొంటున్న అధిక ఒత్తిడిపై దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం చర్చించి పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో ఉపకారవేతనాలకు సంబంధించి అసమానతలు ఉన్నాయని తెలిపారు.

ఉద్యోగ విరమణ ప్రయోజనాల పెంపును స్వాగతిస్తున్నాం

- 2024 జూలై 1 నుంచి రిటైర్డ్ అయినవారికీ వర్తింపజేయాలి
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలను, 65 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయస్సును పెంచడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రకటించింది. అయితే, 2024 జూలై ఒకటో తేదీ నుంచి రిటైర్డ్ అయిన ప్రతి ఒక్కరికీ ఇది వర్తింపజేయాలని కోరింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీచర్లకు రిటైర్డ్ బెనిఫిట్స్‌ను లక్ష రూపాయల నుంచి రూ.2 లక్షలకు, హెల్పర్లకు రూ.50 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచడం శుభపరిణామం అన్నారు. తమ యూనియన్ నిరంతర పోరాటాల ద్వారానే ఈ విజయం సాధ్యమైందన్నారు. డైరెక్టరేట్ ముందు ధర్నా జరిగిన సమయంలో రిటైర్డ్ బెనిఫిట్స్ పెంచుతామనీ, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామనీ, 2024 జూలై ఒకటి తర్వాత రిటైర్డ్ అయ్యే టీచర్లు, హెల్పర్లకు ఈ సౌకర్యాలు వర్తింపజేస్తామని డైరెక్టర్ ఇచ్చిన హామీని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో 2024 జూలై ఒకటో తేదీ నుంచి విధుల నుంచి తొలగించబడ్డ అంగన్‌వాడీటీచర్లు, హెల్పర్లందరి రిటైర్డ్ బెనిఫిట్స్ వచ్చేలా జీవోను సవరించాలని కోరారు.

సన్‌ఫీస్ట్ నుంచి మామ్స్ మ్యాజిక్స్ షైన్స్

హైదరాబాద్ బ్యూరో : ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ ఐటిసికి చెందిన సన్‌ఫీస్ట్ కొత్తగా మామ్స్ మ్యాజిక్ షైన్ కుకీస్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. తమ వినియోగదారులకు స్నాకింగ్ దినచర్యలో ప్రత్యేకమైన అనుభూతులను అందించడానికి విభిన్నమైన ఈ కుకీలను అందుబాటులోకి తెచ్చామని ఆ కంపెనీ ప్రతినిధి అలీ హారిస్ షేర్ తెలిపారు.

44 గ్రాముల ధర రూ.10గా, 128 గ్రాముల ప్యాక్ ధర రూ.35గా నిర్ణయించింది.

కార్పొరేట్లకు న్యాయం చేయడమే మోడీ లక్ష్యం

- ఆహారభద్రతను పక్కనబెట్టిన కేంద్ర సర్కారు
- ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర
- జులై 9 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక న్యాయం పక్కకుపెట్టి కార్పొరేట్లకు న్యాయం చేయడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రంలోని మోడీ సర్కారు పనిచేస్తున్నదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. బిజెపి సర్కారు అనుసరిస్తోన్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆ రోజు 500 జిల్లాల్లో 1000 కేంద్రాల్లో గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులను, ఉపాధి కార్మికులను సమీకరించి పోరాటం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇండియా నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందని మోడీ గొప్పలు చెప్పుకోవడం మాని.. రైతులు, గ్రామీణ పేదలు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనే దానిపై దృష్టి పెట్టి అరికట్టాలని సూచించారు. నేషనల్ క్రైం బ్యూరో నివేదిక ప్రకారం దేశంలో ఏడేండ్లలో లక్ష మంది ఆత్మహత్యలు చేసుకున్నారనీ, వారిలో ఎక్కువగా గ్రామీణ పేదలే ఉన్నారని గుర్తుచేశారు. గ్రామాల్లో ఉపాధి తగ్గి ప్రజల కొనుగోలు శక్తి స్థాయి పడిపోయిందనీ, వలసలు పెరుగుతున్నాయని ఎత్తిచూపారు. ఆహారభద్రతకు తూట్లు పొడుస్తూ దేశంలో వ్యవసాయ రంగాన్ని అంబాని, అదాని లాంటి కార్పొరేట్లకు అప్పగించే కుట్ర శరవేగంగా జరుగుతున్నదని విడమర్చి చెప్పారు. దీనికి గ్రామీణ ప్రాంతంలోని ధనిక వర్గం సహకరిస్తున్న తీరును వివరించారు. కంపెనీ వ్యవసాయంతో సన్న, చిన్నకారు, వ్యవసాయ కార్మికులు, దానిపై ఆధారపడి బతికేవారు రోడ్డున పడుతారని హెచ్చరించారు. గోదాముల్లో నిల్వలు మూలుగుతున్నా పేదలకు 10 కేజీల చొప్పున రేషన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా పేదలకు పోషకాలతో కూడిన 12 రకాల నిత్యావసరాలు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. ఉపాధి హామీ చట్టాన్ని మోడీ సర్కారు నిర్వీర్యం చేస్తూ పోతున్న తీరును గణాంకాలతో వివరించారు. పేదరికాన్ని నిర్మూలించే బాధ్యతను కంపెనీలకు ఇవ్వాలన్న ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు మాటల్ని ఆయన తప్పుబట్టారు. భూకేంద్రీకరణను తగ్గించకుండా పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. గ్రామీణ పేదలు ఇండ్లు కట్టుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.ఐదు లక్షల చొప్పున సహాయం అందజేయాలని సూచించారు. దేశ సహజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే గ్రీన్‌ఫీల్డ్ హైవేల నిర్మాణమని అని విమర్శించారు. కేంద్రం విధానాలను నిరసిస్తూ జూన్ ఒకటో తేదీ నుంచి 15 వరకు గ్రామీణ ప్రాంతాల్లో, పనిప్రదేశాల్లో సమావేశాలు నిర్వహిస్తామనీ, పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, జీపు జాతాలు నిర్వహిస్తామని చెప్పారు. దేశ సహజ వనరులను రక్షించేందుకు, కార్మిక, కర్షకుల హక్కులను కాపాడేందుకు జూలై తొమ్మిదిన తలపెట్టిన దేశభక్తియుత సమ్మెను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతులకు ఎమ్ఎస్‌పి గ్యారెంటీ చట్టం తేవాలనీ, అదే సమయంలో రైతుకు సాగయ్యే ఖర్చులో 20 శాతాన్ని కేంద్రం భరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ...ఉపాధి హామీ చట్టంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వినతిపత్రాలు కూడా తీసుకోలేని స్థితిలో కలెక్టర్లు, పీడీలు ఉండటాన్ని తప్పుబట్టారు. ఇదేం ప్రజా పాలన అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఉపాధి హామీ కార్మికులకు ఇచ్చిన 150 రోజుల పనికల్పన, పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ విస్తరణ, రోజుకు రూ.400 వేతనం హామీలను నెరవేర్చాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఆర్.ఆంజనేయులు కూడా పాల్గొన్నారు

భవిష్యత్ టెక్నాలజీపై టిఎఫ్ఎంసిలో చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్

ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ రంగంలో సుస్థిరత, ఆవిష్కరణలు, భవిష్యత్ టెక్నాలజీలపై తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ (టిఎఫ్ఎంసి) 11వ జాతీయ నియో–ఎఫ్ఎం సమ్మిట్ 2025లో చర్చించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 800 కంపెనీలు పాల్గొన్నాయని టిఎఫ్ఎంసి అధ్యక్షుడు సత్యనారాయణ మాథలా తెలిపారు. ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ రంగం భవిష్యత్తులో ఎఐ, సస్టైనబిలిటీ ద్వారా ఎలా మారబోతుందనే అంశంపై లోతైన చర్చ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటి, ఐటిఇఎస్ తెలంగాణ ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రాతో పాటు ఆదిలాబాద్ కలెక్టర్ దివ్య దేవరాజన్, మెట్రో రైలు చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళీ వరదరాజన్, కిమ్స్ సన్‌షైన్ డైరెక్టర్ డాక్టర్ ఆదర్శ్ ప్రముఖులు పాల్గొన్నారు.

సిఫార్సులతో కేసు నమోదు చేస్తే మన ప్రతిష్టకు భంగం

- అలా చేసే వారిపై చర్యలు తీసుకుంటాం : డిజిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఫారసులతో వచ్చే వారి ఫిర్యాదులపైనే కేసు నమోదు చేస్తే ప్రజల్లో పోలీసు శాఖ ప్రతిష్ట దిగజారుతుందనీ, అలా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐలను రాష్ట్ర డిజిపి జితేందర్ హెచ్చరించారు. శనివారం రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన స్టేషన్ హౌజ్ ఆఫీసర్ల (హెచ్ఎస్ఓలు)తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిపి అనేక అంశాలపై మాట్లాడారు. బాధితులు తమకు న్యాయం జరుగుతుందని ఆశతో వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వస్తారనీ, వారి పట్ల సానుభూతితో వ్యవహరించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొన్ని సందర్భాల్లో రాజకీయ నాయకులు, సమాజంలో పలుకుబడి ఉన్న వారి సిఫారసులతో వచ్చే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని ఇది దుష్పరిణామాలకు దారి తీస్తుందని ఆయన కఠినంగా అన్నారు. కేసులు ఎక్కువవుతున్నాయనే ఆందోళనతో కొందరు ఇన్‌స్పెక్టర్లు ఫిర్యాదులను స్వీకరించకుండా దాటవేస్తున్నారని చెబుతూ ఎన్ని ఫిర్యాదులు వచ్చినా స్వీకరించాలనీ, దానిపై ఏసీపీ ఆపై అధికారుల నుంచి ఎలాంటి ఆక్షేపణలు రాబోవని ఆయన తెలిపారు. శాంతిభద్రతలను పరిరక్షించడం, నేరాలను అరికట్టి ప్రజలకు శాంతియుత వాతావరణాన్ని కల్పించడమే పోలీసుల ధ్యేయమని స్పష్టం చేశారు.

వ్యవసాయ బావిలో పడిన ఎలుగుబంటి

- రక్షించిన గ్రామస్తులు, అటవీ సిబ్బంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



వ్యవసాయ బావిలో ఎలుగుబంటి పడిన సంఘటన శనివారం ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలంలోని సాకేర గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సాకేర గ్రామానికి చెందిన రైతు ఆడే ధన్‌రాజ్‌కు చెందిన వ్యవసాయ బావిలో ఎలుగుబంటి పడిపోయింది. శనివారం రైతు పొలానికి వెళ్లడంతో బావిలో నీటిశబ్దం వచ్చింది. బావిలో చూసేసరికి ఎలుగుబంటి పడి ఉన్నట్టు గమనించారు. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఎలుగుబంటిని బయటకు తీసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఫలితం లేకపోవడంతో అటవీ అధికారులకు, అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు సంఘటన స్థలానికి వచ్చి నిచ్చెన, జెసిబి సాయంతో దాదాపు మూడు గంటల పాటు ప్రయత్నించి ఎలుగుబంటిని బయటికి తీశారు. దీంతో ఎలుగుబంటి ఒకేసారి అడవిలోకి పరుగెత్తింది.

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD
O.S.NO: 2031 OF 2025

BETWEEN:
Ravi Venkatratnam Bhogaraju @ Ravi Bhogaraju & Another ....Plaintiffs
AND
The Tahsildar, Shaikpet Mandal Hyderabad & Other ...Defendants

To
ALL CONCERNED

Please note that, the above named plaintiffs has filed a suit in O.S.NO.2031 of 2025 on the file of Hon'ble V Junior Civil Judge, Hyderabad seeking declaratory relief to declare them as legal heirs of the deceased Sri. Ramakrishna Bhogaraju and Smt. Anuradha Bhogaraju. Any person or persons having any objection with regard to above claim shall appear before the above court at **10:30 A.M.** on **19-06-2025** either in person or through an advocate. Otherwise the matter will be decided as per law.

By order of the court
R. CHAKRADHAR
V. VIMALANAND
Advocates
#6-1-344/8, Padmarao Nagar, Secunderabad-20

IN THE COURT OF THE HON'BLE V SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT :: HYDERABAD
OS.NO. 152 OF 2025

BETWEEN: -
1. Smt. Mantri Prashanthi, W/o. Venkateshwar Rao, Aged about 53 years, Occupation: House wife, R/o. 1-1-289/4, Ashok Nagar, Pepoles High School, Ashok Nagar, Musheerabad, Hyderabad 500020.
2. Mantri Vikram Sai, S/o. Venkateshwar Rao, Aged about 34 years, Occupation. Business R/o. 1-1-289/4, Ashok Nagar, Pepoles High School, Ashok Nagar, Musheerabad, Hyderabad 500020.
3. Gowri Chiluka, W/o. Karunakar Chiluka Narahari, Aged about 32 years, Occupation Claims Services officer CSO- Government of Australia (Services Australia), R/o. 1-1-289/4, Ashok Nagar, Pepoles High School, Ashok Nagar, Musheerabad, Hyderabad 500020.
...PLAINTIFFS
AND
1. The Tahsildar, Lower Tank Band, Hyderabad.
2. Union Bank of India, Rep., by its Branch Manager, Opp. GVK Mall, Road No. 4, Banjara Hills, Hyderabad -500 034, Telangana state.
3. All Concerned
...Defendants

PUBLIC NOTICE

The above-named plaintiffs filed suit for declaration to declare them as the Legal heirs of Late Mantri Venkateshwar Rao, as such the Hon'ble Court pleased to order for any objections for substitute of service, The said suit stands posted to **27.06.2025** at **10.30** A.M, for any objections/Claims, the matter will be proceeded in accordance with law.

// By Order of the Court//
K. MANYAM KONDA
DASARI SHWETA PRAVALIKA
SYED SIDDIQHA
ADVOCATES
KV & B Law Partners, Flat No. 301, 3rd Floor, Lake Melody, Raj Bhavan Road, Somajiguda, Hyderabad-500082.

అంబుజమడ్ హత్యాకాండను నిరసించండి

- 10న దేశవ్యాప్త బంద్
- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అంబుజమడ్ హత్యాకాండను నిరసించాలని, జూన్ పదిన దేశవ్యాప్త బంద్ పాటించాలని, నంబాల కేశవరావు సహా 27 మందికి జూన్ 11 నుండి ఆగస్టు 3వ తేదీ వరకు సంస్మరణ సభలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట పాత్రికేయులకు శనివారం లేఖ అందింది. ఆర్ఎస్ఎస్, కేంద్రంలోని బిజెపి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు బసవరాజ్ సహా 27 మంది పార్టీ, పిఎల్‌జిఎ కార్యకర్తలను హత్య చేయడాన్ని ఖండిస్తూ దేశవ్యాప్తంగా బంద్ పాటించాలని కోరారు. ఈ హత్యాకాండ సాగించిన భద్రతా బలగాల పట్ల తనకెంతో గర్వంగా ఉందని మోడీ, చారిత్రాత్మక విజయమని అమిత్ షా ప్రకటించడం, ఈ ప్రకటనల ద్వారా వారు తమ రక్తపిపాస, నరహంతక స్వభావాన్ని మరోమారు నిర్లజ్జగా ప్రకటించుకున్నారని తెలిపారు. మార్చి చివరి వారంలో జస్టిస్ చంద్రకుమార్ నాయకత్వంలో హైదరాబాద్‌లో శాంతి చర్చల కమిటీ ఏర్పడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని ప్రకటన విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు సానుకూల పరిస్థితిని కల్పిస్తే తమ పార్టీ అందుకు సిద్ధమేనని మార్చి 28న పత్రికా ప్రకటన ద్వారా మా వైఖరిని ప్రకటించాం అని తెలిపారు. ఈ ప్రకటనలను ఏ మాత్రమూ లెక్క చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరమ ఫాసిస్టు పద్ధతుల్లో 'కగార్' యుద్ధాన్ని కొనసాగిస్తూ ఏప్రిల్ ఒకటి నుండి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా దాదాపు 85 మంది కామ్రేడ్స్‌ను హత్య చేశాయని పేర్కొన్నారు. గత సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు దాదాపు 540 మంది మావోయిస్టులను, జల్, జంగల్, జమీన్ కోసం పోరాడుతున్న సాధారణ ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేశాయని వివరించారు.

సిఫారసులతో కేసు నమోదు చేస్తే మన ప్రతిష్టకు భంగం

- అలా చేసే వారిపై చర్యలు తీసుకుంటాం
- డిజిపి జితేందర్ కుమార్ హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఫారసులతో వచ్చే వారి ఫిర్యాదులపైనే కేసు నమోదు చేస్తే ప్రజల్లో పోలీసు శాఖ ప్రతిష్ట దిగజారుతుందనీ, అలా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐలను రాష్ట్ర డిజిపి జితేందర్ హెచ్చరించారు. శనివారం రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన స్టేషన్ హౌజ్ ఆఫీసర్ల(హెచ్ఎస్ఓలు)తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిపి అనేక అంశాలపై మాట్లాడారు. బాధితులు తమకు న్యాయం జరుగుతుందని ఆశతో వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వస్తారనీ, వారి పట్ల సానుభూతితో వ్యవహరించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొన్ని సందర్భాల్లో రాజకీయ నాయకులు, సమాజంలో పలుకుబడి ఉన్న వారి సిఫారసులతో వచ్చే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని ఇది దుష్పరిణామాలకు దారి తీస్తుందని ఆయన కఠినంగా అన్నారు. కేసులు ఎక్కువవుతున్నాయనే ఆందోళనతో కొందరు ఇన్‌స్పెక్టర్లు ఫిర్యాదులను స్వీకరించకుండా దాటవేస్తున్నారని చెబుతూ ఎన్ని ఫిర్యాదులు వచ్చినా స్వీకరించాలనీ, దానిపై ఏసీపీ ఆపై అధికారుల నుంచి ఎలాంటి ఆక్షేపణలు రాబోవని ఆయన తెలిపారు. శాంతిభద్రతలను పరిరక్షించడం, నేరాలను అరికట్టి ప్రజలకు శాంతియుత వాతావరణాన్ని కల్పించడమే పోలీసుల ధ్యేయమని స్పష్టం చేశారు. శాంతిభద్రతలు సవ్యంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని తెలిపారు.

గిరిజనులకు రూ.17,169 కోట్లు కేటాయించాం

- గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం కాపాడేందుకే నల్లమల్ల డిక్లరేషన్
- పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క
- గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట : మంత్రి పొంగులేటి

శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆత్మగౌరవం, సమ సమాజం కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే సాధ్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఆదివాసీ నాయకుల శిక్షణా శిబిరంలో ఆయన ప్రసంగించారు. బిఆర్ఎస్ పాలనలో సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సబ్ ప్లాన్ నిధులను తూచ తప్పకుండా ఖర్చు చేస్తున్నామని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గిరిజనులకు సబ్ ప్లాన్ కింద రూ.17,169 కోట్లు ఖర్చు చేయబోతున్నామని, గతంలో మిగిలిన 1,296 కోట్ల నిధులనూ క్యారీ ఫార్వర్డ్ చేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ఇంటింటికి తీసుకువెళ్లాలని నాయకులను కోరారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడానికి ఆత్మగౌరవ నినాదం, 85 శాతం ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రతిఫలాలు దక్కాలని ఆలోచనతో సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. బిఆర్ఎస్ పదేండ్ల పాలనలో నిధులు రాలేదని, ఆత్మగౌరవం అంతకన్నా దక్కలేదని డిప్యూటీ సిఎం ఎద్దేవా చేశారు. ధరణి పేరుతో రాష్ట్రంలోని భూములను హస్తగతం చేసుకోవడం అన్యాయమని ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని ఎన్నికల ముందు చెప్పామని, చెప్పినట్టుగానే భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలకు నిధులు కావాలని అడిగినా గత ప్రభుత్వం ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం రాగానే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభిస్తున్నామన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో గిరిజనుల కోసం వెయ్యి కోట్లు కేటాయించామని, దేశ చరిత్రలోనే ఇది ఒక రికార్డు అన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో బతికేందుకు 2006లో అటవీ హక్కు చట్టం కింద గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో గిరిజనుల ఆధీనంలో ఉన్న 6.70 లక్షల ఎకరాలు సాగులోకి తెచ్చేందుకు ఇందిరా సౌర గిరి జల వికాసం అనే పథకాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ఇచ్చిన పట్టాలతో పాటు ఆత్మగౌరవంతో బతకడానికి గిరిజనులకు నిధులు కేటాయించామని, నల్లమల డిక్లరేషన్తో పనులు మొదలు పెట్టామని తెలిపారు. తాను డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలోనే ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను అసెంబ్లీలో ఆమోదింపజేసిన విషయాన్ని గుర్తు చేశారు.

గిరిజన సంక్షేమానికి పెద్దపీట : పొంగులేటి

గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ హయాంలో సుమారు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను గిరిజనులకు పంపిణీ చేశారని, ఆ భూములను బిఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు పక్కదోవ పట్టించారని అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకు ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని అన్నారు. అంతకు ముందు కిన్నెరసాని గిరిజన బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో మంత్రి పొంగులేటి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి శ్రమదానం చేశారు. మీనాక్షి నటరాజన్ మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వీరయ్య, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, డాక్టర్ జాటోత్ రామచందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

అత్యాధునిక సౌకర్యాలతో గోశాలల ఏర్పాటు

- పూర్తిస్థాయి ప్రణాళిక రూపొందించాలి
- సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాలల కోసం సంబంధించి కమిటీని ఏర్పాటు చేయాలనీ, నిర్ణీత గడువులోగా ఆ కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై అధికారులతో ముఖ్యమంత్రి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ గోసంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలని సూచించారు. మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలనీ, కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇరుకు స్థలాల్లో బంధించినట్లుగా కాకుండా మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణకు సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్ ను ప్రభుత్వం ఖరారు చేయనున్నది. ఈ సమీక్షా సమావేశంలో సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్ రాజ్, అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుపోషణ విభాగం డైరెక్టర్ బి.గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

జూరాలకు వరద జలాలు

- ఎగువ నుండి 80 వేల క్యూసెక్కుల నీరు
- 12 గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న వర్షాల వల్ల జూరాలకు వరద జలాలు చేరుతున్నాయి. 80 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో 12 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదలుతున్నారు. రెండు నెలల ముందే వరద జలాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు అకాల వర్షాలతో యాసంగిలో వేసిన పంటలు తడిసి ఇబ్బందులు పెట్టినా.. ఎగువన కురిసిన వర్షాలతో జూరాలకు వరద నీరు రావడం పట్ల రైతుల్లో సంతోషం నెలకొంది. 18 ఏండ్ల తర్వాత మే నెలలో జూరాల గేట్లు ఎత్తి కిందికి నీటిని వదలడం ఇదే మొదటి సారి అని జూరాల ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువన కురిసే భారీ వర్షాల వల్ల వరద మరో వారం రోజులపాటు కొనసాగే అవకాశాలున్నాయి. నారాయణపూర్, ఆల్మట్టి, తుంగబద్ర డ్యాంల నుంచి నీరు భారీగా వస్తోంది. వారం రోజుల పాటు వరదలొస్తే శ్రీశైలం పూర్తి స్థాయిలో నిండే అవకాశాలున్నాయి. ఈ రిజర్వాయరు నిండితే దీనికి అనుబంధంగా నిర్మించిన కల్వకుర్తి ఎత్తిపోతలతో పాటు భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్‌కు నీటిని విడదల చేసే అవకాశాలున్నాయి. సాగునీటితో పాటు తాగునీటికి ఎటువంటి సమస్య ఉండదు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతంలోని కృష్ణా పరివాహక ప్రాంతంలో ప్రతి ఏడాది జూన్ చివరి వారంలో వర్షాలు కురిసేవి. జులైలో జూరాలకు వరద నీరు వచ్చేది. ఈ సారి ముందుగానే నీరు రావడంతో అధికారులు నీటి లభ్యత కిందికి వదలడం తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగుకు అత్యంత ప్రయోజనం చేకూర్చే జూరాల నీటితో కళకళలాడుతుండటంతో ఈ ప్రాంత ఆయకట్టుతో పాటు నదీ సమీప ప్రాంతాల్లో వరితో పాటు ఇతర పంటలు వేసే రైతులు సాగుకు సిద్ధమౌతున్నారు.

సంతోషంలో రైతులు

జూరాల ఆయకట్టు సుమారు లక్షా ఐదు వేల ఎకరాలు. ఇక్కడ అత్యధికంగా వరి సాగు చేస్తుంటారు. వరితో పాటు చెరుకు, అరటి, సీడ్‌పత్తి సాగు చేసేందుకు రైతులు సమాయతమౌతున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల కింద సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగవుతాయి. ఆరుతడి పంటలతో పాటు వరి పంట, కూరగాయల సాగుకు నీటి కొరత ఉండదు. అయితే అధికారులు ప్రాజెక్టుల నుంచి నీరు వృథాగా కిందికి పోకుండా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

ముందస్తు వరదలు రావడం సంతోషకరం
- నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కల్వకుర్తి

వర్షాధార ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్ నగర్‌లో సాగునీటి కోసం కాల్వల మీద ఆధారపడాల్సి వస్తోంది. కల్వకుర్తి వంటి చివరి ఆయకట్టుకు నీరు రావాలంటే ముందస్తు వర్షాలు లాభదాయకంగా ఉంటాయి. కాల్వలు ముందుగా వస్తే... ఈ ప్రాంతానికి సాగునీరు వస్తోంది. ముందస్తు వర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి వరద రావడం సంతోషంగా ఉంది.

ప్రయివేటు మెడికల్ కాలేజీలపై చర్యలు తీసుకోండి

- ఎన్ఎంసి చైర్మన్ గంగాధర్‌ను కోరిన మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపకార వేతనాల విషయంలో విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ప్రయివేటు మెడికల్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ బి.ఎన్.గంగాధర్‌ను కోరారు. హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన గందాధర్‌తో శనివారం హైదరాబాద్‌లో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తనకిచ్చిన వినతిపత్రాన్ని గంగాధర్‌కు అందజేశారు. రాష్ట్రంలో ఒకేసారి భారీ సంఖ్యలో కాలేజీలు పెరిగినందున, ఫ్యాకల్టీ సర్దుబాటు, బిల్డింగుల విషయంలో అవసరమైన మినహాయింపులు ఇవ్వాలని మంత్రి కోరారు. ఎంబిబిఎస్ సీట్లకు అనుగుణంగా పిజి సీట్లు లేకపోవడం వల్ల, ఎంబిబిఎస్ గ్రాడ్యుయేట్లు ఇబ్బంది పడుతున్నారని మంత్రి తెలిపారు. పిజి సీట్ల సంఖ్యను కూడా పెంచుకునేందుకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి దామోదర చేసిన విజ్ఞప్తులకు గంగాధర్ సానుకూలంగా స్పందించారు. మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లకు సంబంధించిన వివిధ అంశాలపై వారు చర్చించారు. మెడికల్ ఎడ్యుకేషన్ క్వాలిటీ తగ్గిపోకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

అంతకుముందు, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ ఆహ్వానం మేరకు ఉస్మానియాలో స్టూడెంట్స్, టీచింగ్ ఫాకల్టీతో గంగాధర్ సమావేశమయ్యారు. ఉస్మానియా, గాంధీ వంటి కాలేజీల్లో సీట్లు రావడం ఇక్కడి విద్యార్థులకు దక్కిన అదృష్టం అని వ్యాఖ్యానించారు. విద్యార్థి దశలో ఎంత ఎక్కువ మంది పేషెంట్లకు ట్రీట్‌మెంట్ అందించగలిగితే, అంత ఎక్కువ సబ్జెక్ట్ నేర్చుకోవచ్చునని సూచించారు. ఎక్కువ పని చేస్తున్నామన్న భావనను వీడాలనీ, శక్తి మేరకు కష్టపడి ఉత్తమ వైద్యులుగా ఎదగాలని సూచించారు. మెడికోలకు, ఫాకల్టీకి అన్నివిధాల అండగా ఉంటామని హామి ఇచ్చారు. అదే సమయంలో మెడికల్ ఎడ్యుకేషన్ క్వాలిటీ పెంచేందుకు సహకరించాలని ఫాకల్టీని కోరారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఎన్ఎంసీ మాజీ సభ్యుడు, ప్రముఖ డాక్టర్ సూర్యనారాయణ రాజు, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ నందకుమార్ రెడ్డి, డీఎంఈ (అడ్మిన్) శివరామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలతో ఆర్థిక అసమానతలు

- కార్మికవర్గంపై తీవ్రమవుతున్న దాడి
- సిఐటియు అఖిల భారత అధ్యక్షులు హేమలత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలతో దేశంలో కార్మికవర్గంపై దాడి తీవ్రమైందనీ, దాని ప్రతిఘటించేందుకే జులై 9న దేశవ్యాప్త స్వారత్రిక సమ్మె చేపట్టబోతున్నట్టు సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత తెలిపారు. ఆ సమ్మె జయప్రదం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. అందులో ఆమె మాట్లాడుతూ...దేశంలో సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్నాయనీ, సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరి చేతుల్లోనే సంపద కేంద్రీకరణ కావడమే దీనికి కారణమని విడమర్చి చెప్పారు. ఇది దేశంలో సంక్షోభానికి దారితీస్తున్నదని హెచ్చరించారు. ప్రస్తుతం అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రేలాపనలు, టారిఫ్‌ల పెంపులు కూడా పెట్టుబడిదారీ విధాన సంక్షోభంలో భాగమేనని స్పష్టం చేశారు. ఇతర దేశాల సరుకులపై పన్నుల భారం మోపం ద్వారా తన సంక్షోభాన్ని తప్పించుకునే పనిలో అమెరికా ఉందని తెలిపారు. 30, 40 ఏండ్లుగా అమెరికా ఉత్పత్తి ప్రక్రియను ఆపేసి చౌకగా కార్మిక శక్తి దొరికే ప్రాంతాలకు మళ్లించిన తీరును వివరించారు. వివిధ దేశాల్లో తయారయ్యే సరుకులు అమెరికా దిగుమతి చేసుకుంటున్నదని చెప్పారు. కార్పొరేట్లకు మరిన్ని లాభాలు కట్టబెట్టేందుకే మోడీ సర్కారు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మికవర్గంపై దాడేనన్నారు. వాటిని ప్రతిఘటించకపోతే దేశ కార్మికోద్యమ ఉనికే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రవాద ఘటన నేపథ్యంలోనే సార్వత్రిక సమ్మెను జులై 9కి వాయిదా వేయాలని అన్ని కార్మిక సంఘాలు సమిష్టి నిర్ణయం తీసుకున్నాయన్నారు. గుజరాత్‌లో కార్మికవర్గంపై దాడి తీవ్రంగా ఉందని చెప్పారు. ఇటీవల జేకే పేపర్ మిల్లులో సమ్మె జరిగితే ఆ రాష్ట్ర కార్మిక శాఖ కమిషనరే గుజరాత్‌లో ఈ సమ్మె ఏంటని బహిరంగంగా ప్రశ్నించారనీ, తమ శాఖ జోక్యం చేసుకోబోదని చేతులెత్తేశారని వివరించారు. అయినా, కార్మికులు మొక్కవోని దీక్షతో 37 రోజులు సమ్మె చేసి తమ కోర్కెలను సాధించుకున్నారని కొనియాడారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని బేఖాతరు చేస్తూ రాత్రి షిఫ్టుల్లోనూ మహిళలు పనిచేయాలని ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. పాలకులెవరైనా కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ కార్మికవర్గానికి చేస్తున్న అన్యాయాన్ని కార్మికులకు అర్థమయ్యేలా విడమర్చి చెప్పాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను కోరారు. సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం క్యాంపెయిన్‌ను క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

అమెరికా దుర్మార్గాన్ని ఎండగట్టాలి

- పాలస్తీనాకు అండగా నిలబడాలి
- సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్

సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా దుర్మార్గాలను ఎండగడుతూ పాలస్తీనాకు అండగా నిలబడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పీపుల్స్ సాలిడ్ ఫర్ పాలస్తీనా ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన శనివారం మాట్లాడారు. భారతదేశం అనేక సంవత్సరాలుగా పాలస్తీనాకు మద్దతుగా నిలుస్తున్నదని గుర్తు చేశారు. ప్రస్తుతం అక్కడి ప్రజలకు మంచినీరు, ఔషధాలు వంటి నిత్యావసర వస్తువులు కూడా అందకుండా ఇశ్రాయేల్ చేస్తున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. బతకడానికి అవసరమైన వాటిని వారి నుంచి లాక్కుంటూ మానవ విలువలకు, యుద్ధ నియమాలకు వ్యతిరేకంగా ఇశ్రాయేల్ దాడులు చేస్తున్నదని విమర్శించారు. సాక్షాత్తు ఇశ్రాయేల్ మంత్రుల్లో ఒకరు, పాలస్తీనాలో పిల్లలు కూడా తమ శత్రువులే అంటున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో అర్థం చేసుకోవచ్చన్నారు. పాలస్తీనాకు సుదీర్ఘకాలం మద్ధతుగా నిలబడిన భారతదేశంలో నేటి పాలకులు ఇశ్రాయేల్ దుర్మార్గ దాడిని అన్యాయంగా భావించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల గురించి అనేక నీతులు మాట్లాడే అమెరికా పాలస్తీనాలో మహిళలు, పిల్లలతో సహా అన్ని రకాల హక్కుల హననం జరుగుతుంటే మౌనంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపెచ్చు గాజాను ఆక్రమించుకునేంతగా చేసిన ప్రకటన ఆ దేశానికి పెరిగిన సామ్రాజ్యవాద కాంక్షకు తార్కాణమని తెలిపారు. మాజీ ఎంపి, సిపిఐ జాతీయ నాయకులు అజీజ్‌పాషా మాట్లాడుతూ పాలస్తీనాలో 20 లక్షల మందిని చుట్టుముట్టి ఇష్టానుసారంగా బాంబులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి ప్రమాదకర పరిస్థితిని ఎప్పుడు చూడలేదని తెలిపారు. యుద్ధ నేరాల కింద విచారణ జరపాలనీ, ఇండియా ఇశ్రాయేల్‌ను వదిలి మునపటిలాగే పాలస్తీనాకు మద్ధతుగా నిలబడాలని కోరారు. టిజెఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఇశ్రాయేల్‌కు తన ప్రజలను కాపాడుకునే సర్వాధికారాలు ఉన్నాయన్నారు. గాజా, వెస్ట్‌బ్యాంక్ నుంచి పాలస్తీనియన్లను తరిమి ఆక్రమించుకోవాలనుకోవడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. పాలస్తీనా స్వయం నిర్ణయాధికారాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ యుద్ధాల నివారణ, శాంతి పరిరక్షణ, మానవ హక్కులను కాపాడే ప్రధాన ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి ఏర్పాటైందని గుర్తు చేశారు. పాలస్తీనాలో సైనికుల మధ్య యుద్ధం జరగడం లేదనీ, పాలస్తీనా ప్రజలను ఇశ్రాయేల్ చుట్టుముట్టి చంపేస్తున్నదనీ, ఇక మానవ హక్కులేవని ప్రశ్నించారు. ఐక్యరాజ్య సమితిలో ఈ అంశాన్ని లేవనెత్తి పాలస్తీనీయులకు న్యాయం జరిగేలా ప్రయత్నించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సామాజిక కార్యకర్త శారా మాథ్యూస్ మాట్లాడుతూ టర్కీ లాంటి దేశాలు ఇశ్రాయేల్‌తో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేస్తున్నాయని తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీ పాలస్తీనాకు న్యాయం జరగాలని కోరుకుంటున్నదనీ, అదే క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇశ్రాయేల్‌తో ఎలాంటి ఒప్పందాలు చేసుకోవద్దని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా తమీర్ మిల్లట్ ప్రధాన కార్యదర్శి ఒమర్ అహ్మద్ షరీఫ్, అడ్వొకేట్ డాక్టర్ ఇస్మాయిల్, పీపుల్స్ సాలిడారిటీ ఫర్ పాలస్తీనా కన్వీనర్ మొహమ్మద్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వెలుతురులో సర్కారు వైద్యం

- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సెల్‌ఫోన్ వెలుతురులో వైద్యం చేయడం పట్ల వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ట్వీట్ చేశారు. ఒకవైపు కరెంట్ కోతలు, మరోవైపు ఆస్పత్రిలో ఉన్న జనరేటర్ పని చేయడం లేదని తెలిపారు. చివరకు సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో చికిత్స చేయాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. 300 మందికిపైగా రోగులు వచ్చే జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పరిస్థితి ఇలా ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఇతర ఆస్పత్రుల పరిస్థితి ఎలా ఉన్నట్టు? అని ప్రశ్నించారు. ఏడాదిన్నరగా పాలన పడకేసిందనీ, పేదలకు వైద్యం అందకుండా పోతున్నదని విమర్శించారు. గాలిలో మేడలు కట్టడం మానేసి, కనీస సౌకర్యాలు కల్పించంచాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

నకిలీ బిటెక్ యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన తప్పదు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంజనీరింగ్ విద్యనందించే పేరుతో కొంతమంది నకిలీ బిటెక్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఏర్పాటు చేసి ఏడాదికి రూ.లక్షలు వసూలు చేస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు ఆరోపించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, ఉపాధ్యక్షులు నాగేందర్, శ్రీమాన్, స్టాలిన్‌లతో కలిసి నాగరాజు విలేకర్ల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. నకిలీ యూనివర్శిటీలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో నెక్ట్స్ వేవ్ ఇనిస్టిస్ట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ టెక్నాలజీ (ఎన్ఐఎటి) నానక్ రామ్‌గూడ, లిఫ్ స్టార్ట్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ పేరుతో ఫైనాన్స్ డిస్ట్రిక్‌లలో ప్రయివేటు అపార్ట్‌మెంట్లు తీసుకుని వీటిని నడుపుతున్నారని ఆరోపించారు. ఐఐటిలో లేదా ఎన్ఐటిలలో అడ్మిషన్లు రాకపోయినా ఐఐటి లాగానే ఎన్ఐటి స్థాయిలో సిఎస్ఇ (ఆర్టిఫిషియల్, మెషిన్ లెర్నింగ్), సైబర్ సెక్యూరిటి కోర్సుల పేరుతో అడ్మిషన్లు తీసుకుని తరగతులు నడుపుతున్నారని చెప్పారు. యుజిసి, ఎఐసి అనుమతులు లేకుండా క్యాంపస్ ప్రారంభించటమేంటని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను చేర్పించుకుని భారీగా ఫీజులు వసూళ్లు చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావటం లేదన్నారు. ప్రయివేటు డిమ్డ్ యూనివర్శిటీలతో ఎంఓయూ (మెమోరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్) ఉందనే పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నత విద్యామండలి చైర్మన్ స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు అవగాహన కోసం నకిలీ యూనివర్సిటీల పేర్లను ప్రకటించాలని సూచించారు. విద్యార్థులను అలాంటి నకిలీ కళాశాలల్లో చేరొద్దని ప్రకటనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రే స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి నకిలీ యూనివర్శిటీలు వచ్చి వందల కోట్లు కొల్లగొడుతున్నా ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ సీట్లు నింపకముందే బి కేటగిరీ సీట్లను లక్షల రూపాయల డొనేషన్లు తీసుకుని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. వాటిపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. బి కేటగిరీ సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీ చేయాలనీ, డొనేషన్లు వసూళ్లు చేస్తున్న కళాశాలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఫీజులు పెంచకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక ఫీజులు తీసుకుంటున్న కళాశాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ వేసి, విచారణ జరిపించాలని నాగరాజు డిమాండ్ చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు